ఆధార్ అప్‌డేట్‌కు తప్పని తిప్పలు

ఆధార్ కార్డు అప్‌డేట్ కోసం ఆత్మకూరు(ఎం)మండలంలోని వివిధ గ్రామాల నుంచి ప్రజలు మంగళవారం మీ సేవ కేంద్రానికి తరలివచ్చారు. ఒకే ఒక్క కేంద్రం ఉండడంతో నిత్యం వందల మంది ప్రజలు వస్తుండడంతో అప్‌డేట్‌కు సమయం పడుతుంది. దాంతో ప్రజలు గంటలు, రోజుల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. సంబంధిత అధికారులు స్పందించి మండలంలో మరో రెండు ఆధార్ అప్‌డేట్ సెంటర్లను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

-ఆత్మకూరు(ఎం), జూన్ 11

బీసీ జనసభ మహాధర్నా వాల్‌పోస్టర్ విడుదల

వలిగొండ, జూన్ 11 : ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం వెంటనే బీసీ డిక్లరేషన్ అమలు చేయాలని కోరుతూ ఈ నెల 15న ఇందిరాపార్కు వద్ద బీసీ జనసభ ఆధ్వర్యంలో చేపట్టనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు పుట్ట వీరేశం పిలుపు నిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో వివిధ బీసీ కుల సంఘాల నాయకులతో కలిసి మహాధర్నా వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు అతికం లక్ష్మీనారాయణగౌడ్, డేగల పాండరి, రాచకొండ కృష్ణయాదవ్, కొత్త రాంచందర్, నక్కల చిరంజీవి, బాత్క అశోక్ పాల్గొన్నారు.

చెరువు ప్రవాహానికి అడ్డుగా వేసిన కట్టను తొలగించాలి

● ఎస్ఆర్ఎస్పీ ఈఈ విజయ్‌కుమార్

కర్విరాలలో కట్టను పరిశీలిస్తున్న ఎస్సారెస్పీ అధికారులు

తుంగతుర్తి, జూన్ 11 : మండలంలోని కర్విరాల గ్రామ శివారులో చెరువు ప్రవాహానికి అడ్డుగా వేసిన కట్టను తొలగించాలని ఎస్ఆర్ఎస్పీ ఈఈ విజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం గ్రామ శివారులో వేయబడిన కట్టను పరిశీలించి మాట్లాడారు. చెరువు ప్రవాహానికి అడ్డుగా కట్ట వేసిన వెలుగు సునీల్‌ను కట్ట 20 మీటర్ల వరకు తొలగించాలని ఆదేశించారు. చెరువు నీటి ప్రవాహానికి అడ్డుగా కట్ట ఉన్నందున పైన ఉన్న పంట పొలాలు మునిగే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో డీఈ నవీన్‌కుమార్, ఏఈ శ్రీకాంత్, ఆర్ఐ మహమూద్ అలీ, రైతులు అమరేందర్‌రెడ్డి, సునీల్, వెంకన్న, సిబ్బంది పాల్గొన్నారు.

సస్పెన్షన్ ఎత్తివేతకు ఏడీఏకు ఏఈఓల వినతి

కోదాడ రూరల్, జూన్ 11 : మహబూబ్‌నగర్ జిల్లా తొర్రూరుకు చెందిన ముగ్గురు ఏఈఓలను సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ కోదాడ డివిజన్ ఏఈఓలు ఏడీఏ రాజగోపాలానికి మంగళవారం వినతి పత్రం అందించారు. మండల పరిధి కాపుగల్లు రైతు వేదికలో నిర్వహించిన రైతు నేస్తం డివిజన్ స్థాయి వీడియో సమావేశ అనంతరం వినతి పత్రం అందించి మాట్లాడారు. రైతులకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి అండగా ఉంటున్న ఏఈఓలను సస్పెండ్ చేయడాన్ని వారు ఖండించారు. నిష్పక్షపాతంగా విచారణ చేసి న్యాయం చేయాలని పేర్కొన్నారు.

అంగన్‌వాడీ టీచర్‌ను విధుల నుంచి తొలగించాలి

● సమాచార హక్కు న్యాయ రక్షణ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు సంతోష్

బొడ్రాయిబజార్, జూన్ 11 : విధులకు డుమ్మా కొడుతున్న జిల్లా కేంద్రంలోని 22వ వార్డు అంగన్‌వాడీ టీచర్‌ను తొలగించాలని సమాచార హక్కు న్యాయ రక్షణ చట్టం 2005 (ఎన్‌జీఓ) సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు కూనపరెడ్డి సంతోష్ అన్నారు. మంగళవారం సొసైటీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. 22వ వార్డు అంగన్‌వాడీ కేంద్రంపై ఫిర్యాదులు రావడంతో సీడీపీఓ వివరణ కోరినట్లు తెలిపారు. ఆమె తాము ఇచ్చిన లేఖను అంగన్‌వాడీ టీచర్‌కు పంపగా ఆమె ఓ ఇద్దరు నాయకులతో తమ కార్యాలయానికి వచ్చి తనను చంపుతామని బెదిరించి అక్రమ కేసు బనాయించినట్లు చెప్పారు.

అంగన్‌వాడీ టీచర్ విధులకు హాజరు కాకుండా ఆయాతో అటెండెన్స్ వేయించుకుంటూ కేంద్రానికి వచ్చే గుడ్లు, బాలామృతాన్ని పక్కదారి పట్టిస్తున్నట్లు ఆరోపించారు.రెండేళ్లుగా ఇలా జరుగుతున్న అధికారులు స్పందించకుండా ఆమెను వెనకేసుకొస్తున్నట్లు తెలిపారు.

27న దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా సదస్సు

ఎన్‌పీఆర్‌డీ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు అర్వపల్లి లింగయ్య

బొడ్రాయిబజార్, జూన్ 11 : దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) జిల్లా సదస్సును ఈ నెల 27న సూర్యాపేట జిల్లా కేంద్రంలోని పాత వ్యవసాయ మార్కెట్‌లో నిర్వహిస్తున్నట్లు ఎన్‌పీఆర్‌డీ జిల్లా అధ్యక్షుడు అర్వపల్లి లింగయ్య తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన సదస్సు సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం దివ్యాంగులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలన్నారు. ఆరు గ్యారెంటీల్లో భాగంగా దివ్యాంగుల పెన్షన్‌ను రూ.4 వేల నుంచి 6 వేలకు పెంచుతామని నేటి వరకు అమలు చేయలేదన్నారు. కాళ్లు చేతులు లేని వారికి త్రీ వీలర్స్ వాహనాలు ఇస్తామని ఇవ్వలేదని వెంటనే హామీలు అమలు చేయాలన్నారు. జిల్లా సదస్సులో దివ్యాంగుల సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణకు చర్యలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో ఎన్‌పీఆర్‌డీ జిల్లా గౌరవాధ్యక్షుడు ఎస్.రామారావు, మహిళా విభాగం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఎస్.కె.ఆర్షియా, జిల్లా కార్యవర్గ సభ్యులు అరుణ, నర్సిరెడ్డి, దేవయ్య, వెంకట్, రామ్‌కుమార్, వెంకటేశ్వర్లు, కిరణ్ పాల్గొన్నారు.

మట్టపల్లి నృసింహుడి నిత్య కల్యాణం



స్వామివారి నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి, జూన్ 11 : మండలంలోని మట్టపల్లి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో నృసింహుడి నిత్య కల్యాణాన్ని అర్చకులు మంగళవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి పంచామృతాలతో అభిషేకం చేసి పట్టు వస్త్రాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. కల్యాణ మండపంలో కల్యాణం నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో ఆలయ అనువంశిక ధర్మకర్త చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ సిరికొండ నవీన్ దేవస్థాన సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ఫిట్‌నెస్ ఉంటేనే... రైట్ రైట్

● నేటి నుంచి రోడ్డు ఎక్కనున్న స్కూల్ బస్సులు, వ్యాన్లు
● తల్లిదండ్రులు ఈ నిబంధనలు గమనించాలి

నేరేడుచర్ల, జూన్ 11 : వేసవి సెలవులు ముగియడంతో బుధవారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభమవుతున్నాయి. ప్రైవేట్ పాఠశాలల మధ్య ఉన్న పోటీతో విద్యార్థుల కోసం సొంతంగా బస్సులు, వ్యాన్లు నడుపుతున్నారు. ఈ వాహనాలకు సంబంధించి బస్సుల ఫిట్‌నెస్, కండీషన్‌తో పాటు పాటించాల్సిన సాధారణ నిబంధనలు ఇలా ఉన్నాయి.

- బస్సు ఏడమ వైపు విద్యా సంస్థ పేరు టెలిఫోన్, మొబైల్ నంబర్లు, పూర్తి చిరునామా రాయాలి
- బస్సు డ్రైవర్‌గా నియమించే వ్యక్తి వయస్సు 60 ఏళ్లకు పైబడి ఉండకూడదు
- విద్యా సంస్థలు తమ బస్సులు నడిపే డ్రైవర్ల ఆరోగ్య పట్టిక (హెల్త్ కార్డు) నిర్వహించాలి. రక్తపోటు, మధుమేహం, కంటి చూపు వంటి ప్రాథమిక పరీక్షలను ప్రతి మూడు నెలలకు ఒకసారి సొంత ఖర్చులతో చేయించి, ఆ వివరాలను రికార్డు చేయాలి
- బస్సు ఐదేండ్లు నడిపిన అనుభవం ఉన్న వారిని మాత్రమే డ్రైవర్‌గా నియమించాలి
- బస్సు డ్రైవర్‌కు సంబంధించిన పూర్తి వివరాలను విద్యార్థుల తల్లిదండ్రుల కమిటీకి చెప్పాలి
- బాహ్య పరికరాలు, విండ్ స్క్రీన్, వైపర్స్, లైటింగ్, వాటి మెకానికల్ కండీషన్, పనితీరును తెలుసుకునేందుకు నెలకోసారి ప్రిన్సిపాల్, పేరెంట్స్ కమిటీ కలిసి బస్సును తనిఖీ చేయాలి
- క్రమ సంఖ్య గల ఫిర్యాదుల పుస్తకాన్ని ప్రతి బస్సులో ఉంచాలి. అందులో నమోదు చేసిన ఫిర్యాదులను విద్యా సంస్థల ప్రిన్సిపాల్స్ ప్రతి నెలా తనిఖీ చేయాలి
- ప్రతి బస్సులో అత్యవసర ద్వారం ఉండాలి. దానిపై అత్యవసర ద్వారం అని పెద్ద అక్షరాల్లో రాయాలి
- బస్సులో ఫస్ట్ ఎయిడ్ బాక్స్ తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలి
- బస్సుల పార్కింగ్ కోసం విద్యాసంస్థ ఆవరణలోనే స్థలం కేటాయించాలి
- విద్యార్థులను బస్సులోకి సురక్షితంగా ఎక్కించడం, దించడం చేయాలి
- ట్రాన్స్‌పోర్టు కమిషనర్ ఉత్తర్వుల ప్రకారం బస్సు డ్రైవర్, అటెండర్ విధిగా యూనిఫామ్ ధరించాలి
- బస్సుల్లో ప్రయాణించే విద్యార్థుల సంఖ్య, వారి పేర్లు, పట్టికలో రాయాలి
- విద్యా సంస్థల బస్సులకు విద్యార్థులు ఎక్కడం, దిగడాన్ని సరిగ్గా గమనించేందుకు కన్వెక్స్ క్రాస్ వ్యూ అద్దాలను అమర్చాలి. బస్సులో ఒక పారదర్శకత అద్దాన్ని కూడా ఏర్పాటు చేయాలి
- బస్సు ఇంజిన్ కంపార్ట్‌మెంట్‌లో ఒక అగ్నిమాపక యంత్రం ఉండాలి
- బస్సుల్లో సీట్ల కింద బ్యాగులు ఉంచేందుకు అరలు ఏర్పాటు చేయాలి
- బస్సులో అక్కడక్కడా తగు దూరంలో కప్పు, కింద భాగాన్ని కలుపుతూ నిలువు స్తంభాలను ఏర్పాటు చేయాలి
- వాహనానికి నాలుగువైపులా, పై భాగం మూలల్లో రంగురంగుల లైట్లు అమర్చాలి
- బస్సు ఏ పాఠశాలకు చెందినదో స్పష్టంగా తెలిసేలా వాహనం ముందు భాగంలో పైన పెద్ద సైజు అక్షరాలతో రాయాలి
- బస్సుకు విధిగా రవాణా శాఖ జారీ చేసిన పర్మిట్ ఉండాలి
- ప్రతి విద్యా సంస్థ తమ డ్రైవర్లను రవాణా శాఖ నిర్వహించే రీఫ్రెషర్ కోర్సుకు పంపించాలి
- విద్యా సంస్థల బస్సుల తలుపులను సురక్షిత లాకింగ్ సిస్టమ్‌లో అమర్చాలి
- సైడ్ విండోలకు మధ్యలో అడ్డంగా 3 లోహపు కడ్డీలు అమర్చాలి
- సీటింగ్ కెపాసిటీ కంటే మించి విద్యార్థులను తీసుకెళ్లకూడదు
- బస్సు ఫుట్ బోర్డుపై మొదటి మెట్టు భూమి పైనుంచి 325 మిల్లీమీటర్ల ఎత్తు మించి ఉండరాదు
- బస్సు ఎక్కేటప్పుడు మెట్లు జారకుండా ఉండే లోహంతో తయారు చేయించాలి
- బస్సులో ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు పట్టుకునేందుకు వీలుగా బస్సు ముందరి తలుపు మెట్లకు సమాంతరంగా రైలింగ్‌లు ఏర్పాటు చేయాలి.

ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య

● మిర్యాల జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం అమృతారెడ్డి

నాగారం : నాగారంలో బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

నూతనకల్, జూన్ 11 : ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య లభిస్తున్నదని మిర్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం అమృతారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని మిర్యాల గ్రామంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు బడిబాట కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చదివించాలని తల్లిదండ్రులను కోరారు. బడికి పంపడం మీ వంతు చదువు చెప్పడం మా వంతు అంటూ గ్రామంలో తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో ఉచిత మధ్యాహ్న భోజనం, ఉచిత దుస్తులు, ఉచిత పాఠ్య పుస్తకాలు ప్రభుత్వమే అందజేస్తుందన్నారు.

నాగారం : మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. హెచ్ఎం, ఉపాధ్యాయులు ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలతో గ్రామస్తులకు అవగాహన కలిపించారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలి

● సామాజిక కార్యకర్త బషీర్

కోదాడ రూరల్, జూన్ 11 : రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని కోదాడ పట్టణ సామాజిక కార్యకర్త సయ్యద్ బషీర్ మంగళవారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఏర్పాటు నుంచి పలు కారణాలతో పథకాల అమలుకు కాలయాపన చేస్తున్నట్లు దుయ్యబట్టారు. ఇప్పటికైనా అర్హులకు పథకాలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

అన్నదానం

అన్నదానం చేస్తున్న తెలంగాణ రాష్ట్ర రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చిన్నపరెడ్డి

కోదాడ టౌన్, జూన్ 11 : అన్నదానం పుణ్యకార్యం అని తెలంగాణ రాష్ట్ర రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చక్కెర చిన్నపరెడ్డి అన్నారు. మంగళవారం కోదాడ పట్టణంలోని వీర బ్రహ్మేంద్రస్వామి, అభయాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం విప్పకుంట్ల జగన్మోహన్‌రెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా గడ్డం వెంకట సూర్యారెడ్డి మిత్రమండలిచే నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. అన్నదానానికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు జూకూరి అంజయ్య, ఆలయ సెక్రటరీ కోట తిరుపతయ్య, అన్నదాన నిర్వాహకులు దేవరశెట్టి హనుమంతరావు, గడ్డం వెంకట సూర్యారెడ్డి, వాడపల్లి రవికుమార్, బాల్తు శ్రీనివాస్, నెల వారి దాతలు రంగా శ్రీను, గునుగుంట్ల పవన్, పాటిబండ్ల సుధాకర్, ఆలయ కమిటీ సభ్యులు కృష్ణమూర్తి, సత్యం, బ్యాటరీ చారి, వంశీకృష్ణ పాల్గొన్నారు.

నాగారం పాల కేంద్ర సొసైటీ అధ్యక్షుడిగా సంజీవ

నాగారం, జూన్ 11 : నాగారం గ్రామ పాల కేంద్ర చైర్మన్‌గా కన్నెబోయిన సంజీవ ఎన్నికయ్యాడు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. సొసైటీ అభివృద్ధి కోసం తనవంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో పాల కేంద్రం డైరెక్టర్ కడారి బుచ్చిరాంరెడ్డి, అనంతుల శ్రీనివాస్, అక్కినపల్లి వెంకన్న, బాలగోని సోమయ్య, కన్నెబోయిన శంకరయ్య, చిప్పలపల్లి శ్రీను, అనంతుల నవనీత, వసవరాజు పిచ్చమ్మ, మరికంటి సోమయ్య పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

● సీఐ చరమందరాజు

హుజూర్‌నగర్ , జూన్ 11 : సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు అన్నారు. మంగళవారం విలేకరులలో ఆయన మాట్లాడుతూ.. హుజూర్‌నగర్ సర్కిల్ పరిధిలో పలువురు సైబర్ మోసాల బారిన పడుతున్నారని, బ్యాంక్ నుంచి అని చెప్పి ఓటీపీ ద్వారా ఖాతాలోని డబ్బులను కాజేస్తున్నట్లు చెప్పారు. ఎవరైనా పోలీసుల పేరుతో డబ్బులు అడిగితే పంపవద్దన్నారు. సర్కిల్ పరిధిలో పలువరి ఖాతాల నుంచి రూ.96 లక్షలు అపహరణకు గురైనట్లు వెల్లడించారు. అందులో రూ.26 లక్షలను రికవరీ చేసినట్లు తెలిపారు.

నోట్‌బుక్స్ అందజేత

పెన్‌పహాడ్ : హెచ్ఎంలకు నోట్‌బుక్స్, పాఠ్య పుస్తకాలు అందజేస్తున్న ఎంఈఓ రవి

తిరుమలగిరి : తిరుమలగిరి ఎమ్మార్సీ కార్యాలయంలో ఉపాధ్యాయులకు పాఠ్య పుస్తకాలు అందజేస్తున్న ఎంఈఓ శాంతయ్య

పెన్‌పహాడ్, జూన్ 11 : సర్కారు పాఠశాలల్లో చదువుకునే విద్యార్థుల కోసం ప్రభుత్వం అందించిన ఉచిత పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్, యూనిఫామ్‌లను మంగళవారం మండల వనరుల కేంద్రంలో ఆయా పాఠశాలల హెచ్ఎంలకు ఎంఈఓ రవి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలల పునఃప్రారంభం మండలంలోని అన్ని పాఠశాలల్లో పండుగ వాతావరణంలో జరుపుకోవాలన్నారు. మండలానికి సుమారు నోట్ పుస్తకాలు 15 వేలు, పాఠ్య పుస్తకాలు 8 వేలు రాగా అన్ని పాఠశాలలకు పంపిణీ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎచ్ఎంలు బండారు శేఖర్, శ్రీనివాసులు, సురేందర్‌రెడ్డి, మేకల రాజశేఖర్, సీఆర్పీలు సైదయ్య, వహీద్, నాగు పాల్గొన్నారు.

తిరుమలగిరి : మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు ప్రభుత్వం పంపిణీ చేసిన ఉచిత పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్‌ను ఆయా పాఠశాలల ఉపాధ్యాయులకు ఎంఈఓ శాంతయ్య అందజేశారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నడిగూడెం : మండల పరిధిలోని పలు పాఠశాలలకు పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్‌ను ఎంఐఎస్ కో ఆర్డినేటర్ నాగరాజు హెచ్ఎంలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లోని ప్రతి విద్యార్థికి పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్‌ను అందించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఆర్పీలు గోవర్ధన్, గురుస్వామి, అంజన్ పాల్గొన్నారు.

ప్రజలకు ప్రాణ సంకటంగా పాత ఇల్లు

● పట్టించుకోని అధికారులు

విష సర్పాలకు నిలయంగా మారిన పాత ఇల్లు

బొడ్రాయిబజార్, జూలై 11 : జిల్లా కేంద్రంలో 20 ఏండ్లుగా జనావాసాల మధ్య ఓ ఇల్లు పడావు పడి విష సర్పాలకు నిలయంగా మారింది. అటుగా వచ్చే ప్రజలు, కాలనీవాసులు భయభ్రాంతులకు గురవుతుండగా విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. జిల్లా కేంద్రంలోని 20వ వార్డు జమ్మిగడ్డలో రోడ్ నంబర్ 5లో ఓ ఇల్లు 20 సంవత్సరాలుగా వదిలేయబడింది. దాంతో ఆ ఇల్లు కీటకాలు, విష సర్పాలకు నిలయంగా మారింది. ఈ విషయమై పలుమార్లు అధికారులకు విన్నవించినప్పటికీ స్పందించకపోవడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ప్రజల ప్రాణాలను దృష్టిలో ఉంచుకుని ఆ స్థలాన్ని శుభ్రం చేయాల్సిందిగా కాలనీవాసులు కోరుతున్నారు.

'ప్రభుత్వ పాఠశాలల్లో వర్కర్లను నియమించాలి'

చివ్వెంల, జూన్ 11 : ప్రభుత్వ పాఠశాలల్లో వర్కర్లను వెంటనే నియమించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు తీకుళ్ల సాయిరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాలలు శుభ్రం చేయడానికి వర్కర్లను నియమించి విద్యాభివృద్ధికి తోడ్పడాలన్నారు. పాఠశాలల్లో పరిశుభ్రత సరిగ్గా లేని కారణంగా విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించేందుకు ఆసక్తి చూపడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుని ప్రభుత్వ పాఠశాలలు బలోపేతానికి కృషి చేయాలని పేర్కొన్నారు.

రైతులు తొందరపడి విత్తనాలను విత్తుకోవద్దు

● ఏఓ మురళి

నూతనకల్, జూన్ 11 : రైతులు తొందరపడి విత్తనాలను విత్తుకోవద్దని మండల వ్యవసాయ శాఖ అధికారి మురళీబాబు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం రాష్ట్రంలోకి నైరుతి రుతుపవనాలు పూర్తిగా ప్రవేశించలేదన్నారు. అక్కడక్కడ కురుస్తున్న వర్షాలకు తొందరపడి విత్తనాలను విత్తుకోకూడదన్నారు. వ్యవసాయ భూములు పూర్తిగా తడవక పోవడం, భూమిలో తేమ శాతం సరిగ్గా లేక విత్తనాల్లో మొలకలు తక్కువగా వస్తాయని తెలిపారు. వర్షాలు సంమృద్ధిగా కురిసిన తర్వాతే రైతులు విత్తనాలను విత్తుకోవాలని సూచించారు. సమావేశంలో ఏఈఓ బుషిగంపల జానయ్య పాల్గొన్నారు.

నేడు మిర్యాల దేవాలయ భూముల కౌలుకు వేలం

నూతనకల్, జూన్ 11 : మండలంలోని మిర్యాల గ్రామంలో గల సీతారామచంద్ర స్వామి దేవాలయ భూములు 2024-2025 సంవత్సరానికి కౌలు వేలం పాటను దేవాలయ ఆవరణలో బుధవారం నిర్వహిస్తున్నట్లు దేవాలయ శాఖ ఈఓ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. దేవాలయ భూములు 103 ఎకరాలు ఒక సంవత్సరం కౌలుకు బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. వేలం పాటలో పాల్గొనదలచిన వారు రూ.లక్ష నగదు గాని డీ.డీ రూపంలో గాని డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని సూచించారు. సమావేశంలో మాజీ సర్పంచ్ మెంచు చక్రయ్య, జిల్లా నాయకులు దరిపెల్లి వీరన్న, అనంతుల శ్రీనివాస్, మన్నెం దశరథ, ఇరుగు కిరణ్, గునగంటి వెంకన్న, పల్లా వెంకన్న పాల్గొన్నారు.

కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలి

అర్వపల్లి, జూన్ 11 : ప్రజా, జానపద, యక్షగాన, సింధు, భాగవతం తదితర కళాకారులందరినీ ప్రభుత్వం ఆదుకోవాలని పూలే అంబేద్కర్ ఆశయ పోరాట సమితి వ్యవస్థాపకుడు ఈదురు వీరపాపయ్య మంగళవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత కేవలం 550 మంది కళాకారులకే ప్రభుత్వం ఉద్యోగం కల్పించడం మిగిలిన వేలాది మంది కళాకారులు జీవనోపాధి లేక భార్య పిల్లలను పోషించుకోలేక ఇబ్బంది పడుతున్నట్లు వెల్లడించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కళాకారులను ఆదుకోవాలన్నారు.

'ప్రత్యేక మెడికల్ బోర్డు ఏర్పాటు చేయాలి'

సూర్యాపేట అర్బన్, జూన్ 11 : దీర్ఘకాలిక వ్యాధులకు గురవుతున్న ఉపాధ్యాయుల కోసం ప్రత్యేక మెడికల్ బోర్డు ఏర్పాటు చేయాలని, బదిలీలో వారికి ప్రత్యేక ప్రిఫరెన్షియల్ కల్పించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శి పర్వతం సంధ్యారాణి, యామా రమేశ్ ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. గతంలో బదిలీలకు దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయులు కొందరు ప్రస్తుతం దీర్ఘకాలిక వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నారని, అటువంటి వారిని గుర్తించి జీఓ నంబర్ 5 ప్రకారం ప్రత్యేకంగా వారికి వెసులుబాటు కల్పించాలన్నారు. భర్తలను కోల్పోయిన ఉపాధ్యాయునీలకు వితంతు విభాగంలో పరిగణించాలని సూచించారు. పదోన్నతులు, బదిలీలు ఎటువంటి సమస్యలు లేకుండా పారదర్శకంగా నిర్వహించాలని పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో కార్మికుడు మృతి

హుజూర్‌నగర్, జూన్ 11 : విద్యుదాఘాతంతో కార్మికుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్ పరిధిలో ఎన్ఎస్పీ ముత్యాల కెనాల్ లైనింగ్ పనులు కొనసాగుతున్నాయి. దినసరి కూలీగా పనిచేస్తున్న ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం బస్తర్ జిల్లా కూకనార్ గ్రామానికి చెందిన రాం సింగ్ (34) సోమవారం కాల్వలో దిగి అల్యూమినియం మెజర్‌మెంట్ స్టాఫ్‌తో కొలతలు తీసుకుని వచ్చే క్రమంలో అక్కడ ఉన్న 11 కెవి కరెంట్ లైన్ తీగ తగలడంతో విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. వెంటనే అక్కడ ఉన్న వారు స్పందించి 108కు సమాచారం ఇచ్చారు. ఆస్పత్రికి తరలించే క్రమంలో మార్గం మధ్యలో మృతి చెందాడు. కాంట్రాక్టర్ బత్తుల నారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ముత్తయ్య తెలిపారు.

నివాళి

నేరేడుచర్ల, జూన్ 11 : మండలంలోని పెంచికల్‌దిన్నె గ్రామానికి చెందిన కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు మర్రి నాగేశ్వర్‌రావు తల్లి సుశీలమ్మ మృతి చెందింది. ఆమె భౌతికకాయాన్ని మంగళవారం మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. మర్రి నాగేశ్వర్‌రావును పరామర్శించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోట గోపి, మాజీ జడ్పీటీసీ మూషం నరసింహ, సీపీఎం మండల కార్యదర్శి సిరికొండ శ్రీను, సీనియర్ నాయకులు సుంకరి వెంకటేశ్వర్‌రావు, సీఐటీయూ మండల కన్వీనర్ నీలా రాంమూర్తి, అరిబండి ప్రసాద్‌రావు, శ్రీధర్ పాల్గొన్నారు.

ఘనంగా ఆలయాల ద్వితీయ వార్షికోత్సవం

బోనాలు ఎత్తుకుని వస్తున్న మహిళలు

గరిడేపల్లి, జూన్ 11 : మండల కేంద్రంలోని గుడాలమ్మ, శివాలయం, వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయాల ద్వితీయ వార్షిక మహోత్సవ కార్యక్రమాలను మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న గుండాలమ్మ తల్లి దేవాలయంలో వేకువజామున ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతి ఇంటి నుంచి ఆడపడుచులు బోనమెత్తుకుని ఊరేగింపుగా భక్తిశ్రద్ధలతో మేళతాళాలు, డప్పు వాయిద్యాల మధ్య కోలాట బృందాలతో అమ్మవారి దేవాలయం వద్దకు వచ్చి బోనాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే స్థానిక శివాలయంలో ఘటాభ